వాడ్రేవు వీరలక్ష్మీదేవి

# కొండఫలం

## మరికొన్ని కథలు



వాడ్రేవు వీరలక్ష్మీదేవి

# కొండఫలం, మరికొన్ని కథలు

వాడ్రేవు వీరలక్ష్మీదేవి

# కొండఫలం

మరికొన్ని కథలు • శ్రీ ప్రచురణ



**KONDA PHALAM** collection of shortstories by **DR.VADREVU VEERALAKSHMI DEVI**. **second impression: October,2010**. Copies 500, Book design Chinaveerabhadrudu. Publications **SRI PRACHURANA**. Composed and designed by **PALLAVI GRAPHICS,** Hyderabad. Book printed at **SAMANTHA GRAPHICS,** Hyderabad. Copies available at **DR.P.VIJAYASREE**, 96 Navodaya colony, Mehidipatnam, Hyderabad-28, Dr.V.Veeralakshmidevi, 70-1/C-2, 'Sefalika', NFCL Road, Kakinada-500 003, Ph:0884 2341642, and all popular book shops.

Rs.**100/-**

మా అమ్మా నాన్నగారూ
నేను పుట్టిన తర్వాత వరుసగా
నాకు ఏడు కానుకలిచ్చారు.
వాళ్లే నా తమ్ముళ్లూ–చెల్లెళ్లూ,
వాళ్లతోపాటు మా రాజా సమీరనందన్‌కూ
ప్రేమగా ఈ కథలు పంచిపెడుతూ..

## వరుసగా


మానవీయ ప్రపంచం కోసం 7

**కథలు**

ఒక రాత్రి గడవాలి 11

కొండఫలం 23

ప్రేమ దినం 37

పేరెంట్ 47

దీపశిఖ 57

జ్ఞాన ప్రసూన 69

బినామీ 81

తృషిత 93

ఇలా.. ఉన్నాం 103

తెలుసుకొనవె యువతా... 119

ఆ పిలుపు ఇంకా అందలేదు 129

కూటి కోసం – కూలి కోసం 137

# మానవీయ ప్రపంచం కోసం

నా కథలను మీముందు పెట్టేముందు నా గురించి కొంత చెప్పుకోవలసి ఉంది. పథేర్ పాంచాలి నవలలో 'దుర్గ'ను చూసినప్పుడు నాకు నేనే గుర్తొచ్చాను. చిన్నప్పుడు నేనూ అలాగే అడవుల్లో, కొండల్లో, కోనల్లో, తోటి పిల్లలతో తిరుగుతూ ఉండేదాన్ని. అప్పుడే అడవి తెలీకుండా నా నేస్తమయింది. అడవి ద్వారా ప్రకృతి, స్వచ్ఛమయిన నింగి, చుక్కలు, వెన్నెల రాత్రులు, వానలకు పొంగే ఏరులు, మండే కొండలు ఇవన్నీ ఇప్పటికీ నా స్పిరిట్యువల్ హోమ్స్‌గా మిగిలిపోయాయి. ఇటువంటి బాల్య జీవితమే నాలోని సృజనశీలతకు కారణమని ఇప్పుడు అనిపిస్తూఉంటుంది.

అలాంటి అడవి ప్రాంతం నుంచి చదువుకోసం ఒక పట్నానికి వచ్చినప్పుడు ఆ అరణ్యసౌందర్యం మరింతగా అర్థమయింది నాకు. నాగరిక జీవితానికి దగ్గరవుతున్న కొద్దీ కరిగిపోతున్న అమాయకత్వం స్పష్టంగా తెలియడం మొదలయింది. అమాయకత్వంతో పాటు ఆనందించే స్వభావం కూడా మరుగవడం తెలుస్తూ వచ్చింది. అది తెలియడానికి చాలా ఏళ్లు పట్టింది. ఈ ఏళ్లలో బయటి ప్రయాణమే కాక అంతకంటే ఎక్కువ లోపలి ప్రయాణం కూడా చేశాను.

ఈ లోపలి ప్రయాణానికి ఎందరో మహాకవులు, గొప్ప రచయితలు ఎంతో సహాయం చేశారు. అతి సాధారణమైన తమ జీవన విధానంతో ప్రభావితంచేసిన మామూలు మనుషులున్నారు. కొత్త సిద్ధాంతాలను కనుగొన్నవారున్నారు. సిద్ధాంతాల సంకెళ్లలో బంధించబడ్డవాళ్లున్నారు.

కొందరిని చూసి జీవితం అంటే ఏమిటో గ్రహించాను. మరికొందరిని చూసి ఎలా జీవించకూడదో తెలుసుకున్నాను. చివరికి ఈ ప్రయాణం నన్ను ఎక్కడికి చేర్చింది అని ఈ రోజు ఆలోచించుకుంటే తిరుగుడు మెట్లలాగ నన్ను నా బాల్య జీవన తరుచ్ఛాయల్లోకే తీసుకువెళ్తోందని అర్థమయింది. అది నా చుట్టూ నాకోసం, నా వారందరికోసం, ఈ ప్రపంచమంతా నాదైన నావారందరికోసం నేను నిర్మించుకోవలసిన ఒక మానవీయ లోకం. ఆ లోకంలో అసమానతలు ఉండవు. వాటికి కారణమయిన వర్ణాలు, వర్గాలూ, లింగబేధాలు పోతాయి. ప్రేమ అనబడే దయా పారావతాలు ఎగురుతూ ఉంటాయి.

అటువంటి లోకాన్ని నిర్మించడం కోసం సృజనావ్యాసంగం వైపు అలవోకగా నడుచుకుంటూ వచ్చాను. అలవోకగా అని ఎందుకంటున్నా నంటే పెద్ద ప్రయత్నం లేకుండా ఏదో ఒక సంతోషం కోసం అన్నట్టుగా జరిగిందా పని. సముద్రం అలని తోస్తే వచ్చి సులువుగా నేలకి మరలినట్టు. అదే వెన్నెల ముగ్గు కథ. పందొమ్మిది వందల ఎనభైలో ఆంధ్రజ్యోతి వారపత్రికలో వచ్చిన కథ.

కుటుంబంలో భార్యాభర్తల మధ్య ఉండవలసిన అనురాగబంధం ఎందుకు పాతబడిపోతుంది. ఇల్లు ఆడవాళ్లని తుప్పు పట్టేలాగ ఎందుకు చేస్తుంది? ఈ ప్రశ్నలు వేసుకుని వీటికి సమాధానాలు చెప్తూ ఈ కథ రాశాను.

*ఆ తర్వాత మూడోవారం అదే పత్రికలో ప్రముఖ సాహిత్యవేత్త జ్యేష్ట. ఆ కథ గురించి ప్రశంసిస్తూ ఇలా రాశారు. 'ఈ కథలో కథ ఉంది, కథా శిల్పం ఉంది. హృదయం ఉంది, ఉపయోగం ఉంది. పదేపదే చదువుకోవడమే ఈ కథకు తగిన విమర్శ' అని. అది ఎంతటి ఉత్తేజ కారకమో నేను వివరంగా చెప్పనక్కర్లేదు.*

ఆ ఉత్సాహంలో వరుసగా నాలుగయిదేళ్ల కాలంలో దాదాపు ఇరవై కథలు రాశాను. అందులో ప్రతి కథా నాకూ, నాలాంటి వాళ్లకీ ఆత్మీయమయినాయి. కారణం, నేను కలగనే మానవతా లోకం కోసం దారి వెతుక్కోవడం ఆ కథలలో ఉండడమే. నాలా వెతికే వాళ్లు కూడా

మరెందరో ఉన్నారని ఆ కథలు రాస్తున్నప్పుడూ, అవి అచ్చయిన తర్వాతా తెలిసేది. ఈ తెలివిడి ఎంతో సంతోషాన్నీ బలాన్నీ ఇచ్చేది.

*'24 కారెట్' అనే కథ ఎనభై రెండులో రాశాను. ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించుకున్న విద్యావంతురాలయిన యువతి నిజమయిన ఆర్థిక స్వేచ్ఛను పొందలేకపోయిందనే ఇతివృత్తంతో. డబ్బు సంపాదించడమే నిజమయిన స్వేచ్ఛకాదనీ దాన్ని ఖర్చు పెట్టుకోగల స్వాతంత్ర్యం లేకపోతే ఉపయోగం లేదనీ ఆ కథ చెబుతుంది. భర్త ఆ స్వేచ్ఛని హరిస్తాడు. అందుకని ఆమె వివాహబంధాన్ని వదులుకోదుగాని భర్తకు దూరంగా వచ్చేస్తుంది. ఇదీ కథ. ఇందులో మరొక విషయం కూడా చెప్పాను. సంపాదించిన డబ్బుని తన చీరలకి, నగలకి, కొత్త ఫ్యాషన్‌లకీ వెచ్చించుకోగల స్వేచ్ఛ నుంచి మరింత ఎదగాలనీ, ఆ ప్రలోభాలనుంచి తన చుట్టూ ఉన్నవారి కోసం ఖర్చు పెట్టగల ఔదార్యం ఉన్న మానసిక స్వేచ్ఛ వైపు ఎదగాలనీ కూడా ఆ కథలో చెప్పాను. ఇవన్నీ నా పాత కథలు.*

స్త్రీలు చెయ్యవలసిన పోరాటాల గురించి, పొందవలసిన విముక్తి–స్వేచ్ఛల గురించి ఎనభైల ఉత్తరార్ధంలో వచ్చిన స్త్రీ వాద సిద్ధాంత సాహిత్యం నా ఆలోచనలకు మరింత స్పష్టతనిచ్చింది.

ఆ తర్వాత రాసిన కథల్లో ఈ ఆలోచనా విస్తృతి కనిపిస్తుంది. నాకు అటు గిరిజన ప్రాంతంతోనూ, ఇటు పట్టణ వాతావరణంతోనూ సంబంధాలు ఉండడం వల్ల రెండు జీవనాలలోని అంశాలు కథలుగా వచ్చాయి.

గిరిజన స్త్రీల మీద జరుగుతున్న అజ్ఞాతమైన దోపిడీ గురించి 'కాలుష్యం' కథ రాశాను. గిరిజన ప్రాంతపు భూమి సమస్యలు, వాటివల్ల సమస్తమూ కోల్పోతున్న గిరిజన స్త్రీల కథలు రాశాను. అర్బనైజేషన్‌లో భూమిని నమ్ముకున్న పేద రైతుల అమాయకపు దుఃఖం గురించి కూడా కథ చెప్పాను.

నేను చూస్తున్న జీవితంలోని సమస్యల మూలాలను వివరించే ప్రయత్నం నా కథల రూపంలో చేశాను.

ఇక్కడ ఒక మాట చెప్పాలి. కథ చెప్పడంలో నాకు కొన్ని నమ్మకాలున్నాయి. కథని వీలయినంత చిక్కగా చెప్పాలన్నది ఒక బలమైన కోరిక. తక్కువ మాటలు, శక్తివంతమయిన భావాన్ని ఆవిష్కరించగల చిన్నచిన్న వాక్యాల్లో కథ చెప్పగలగాలి. కథని ఎవరూ చెప్పని విధంగా

కొత్తగా చెప్పాలి. ఆద్యంతమూ పట్టుసడలని నిర్మాణం ఉండాలి. ఇంచుమించు పదేళ్లపాటు రాసిన కథలు ఆ విధంగానే వచ్చాయి. కాని అవి రచయితలకి నచ్చినంతగా సాధారణ పాఠకులలోకి వెళ్లలేదు.

అది గ్రహించాక కథ చెప్పే పద్ధతిని కొంత మార్చుకున్నాను. ఒకటి రెండుసార్లు కథ చదవాల్సిన అవసరాన్ని తగ్గించి చదవగానే అర్థమయ్యేలాగ కథ రాయడంలోకి వచ్చాను. తొంబయిల తర్వాత రాసిన కథలలో ఈ మార్పు కనిపిస్తుంది.

చిన్న కథ అంటే నాకు చాలా ఇష్టం. చదవడమూ, రాయడమూ కూడా. మంచి కథ రాసిన తర్వాత ఒక పూలతోటని పెంచి పూలు పూయించినంత ఆనందం కలుగుతుంది.

ఇప్పటికే ఆక్రమించుకున్న ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యాపారం మానవ జీవితాన్ని పాలిస్తోంది. కొన్నేళ్లకి శాసించే దశకు కూడా వచ్చేస్తుంది. మానవతా విలువలను నిలబెట్టుకోవడం అసాధ్యమయ్యే పరిస్థితులు కనుచూపు దూరంలోనే ఉన్నాయి. ఈ ప్రమాద పరిస్థితి నుంచి సమాజాన్ని రక్షించగల వారు కవులూ, రచయితలే. నా ఆలోచన కూడా ఆవైపుకే ఉంది. దాని పరిణామాల ఛాయలు చెప్తూ 'ఇలా ఉన్నాం' కథ రాశాను. కానీ చాలదు. ఇంకా ఆ విషయమై చాలా కథలు రావాల్సి ఉంది.

స్త్రీవాదం ఎంతో గొప్పది. దానికి తాత్వికమైన పునాది ఉంది. దాన్ని సమగ్రంగా అర్థం చేసుకోగలిగితే స్త్రీ పురుషుల జీవితాలు ఎంతో ఉన్నతంగా మారి సంతోషప్రదాలవుతాయి. కాని ఇప్పటికి వచ్చిన స్త్రీవాద సాహిత్యం బయట వాతావరణాన్ని మాత్రమే కొంత ప్రభావితం చెయ్యగలిగింది, కాని అంతరంగాలను శుభ్రపరిచేదాకా రాలేదు. ఆ విషయమై ఇంకా ఎంతో సాహిత్యం రావాల్సిఉంది. ఒక వంద సంవత్సరాలపాటు అతివాదాలు పరిహరించుకుంటూ ఆ విధమైన కథలు, నవలలూ వస్తే తప్ప ఈ అసమానతలు తీరవు.

నేను చేసిన సాహిత్య కృషి కంటే చెయ్యవలసిన కృషి ఇంకా ఎంతో ఉందని నాకు తెలుసు. ఇక మిగిలిన నాజీవితం దానికోసమే అని నమ్ముతూ...

విరోధి సంవత్సరం **వాడ్రేవు వీరలక్ష్మీదేవి**
వైశాఖ పౌర్ణమి

నేను చాలా చిన్నప్పుడే వంటిళ్ల 'డ్రెడ్జరీ'ని, ఇళ్ల పెత్తనాన్ని గ్రహించాను. అందుకే వాటిని ఎదిరిస్తూ బయటి కొచ్చాను. బయటి ప్రపంచాన్ని నువు చెప్పినట్టు అర్థం చేసుకోవడమో, గెలవడమో అది చేసాను. ఆ తర్వాతనే ఇంటిని కూడా గెలవొచ్చని తెలిసింది'

# ఒక రాత్రి గడవాలి

**రా**త్రంతా రైల్లో నిద్రలేదు. 'లేదు' కాదు, పోలేదు. పోలేకపోవడానికి కారణం నిద్ర రాలేదు. సదుపాయమయిన బెర్త్ దొరికింది. చక్కగా టిఫిన్ తిని, దానిమ్మ గింజల ఫలహారం చేసాను. పడుకున్నాను. అయినా నిద్ర పట్టలేదు. ఉత్కంఠ, ఆమెతో ఎలా మాట్లాడాలి? ఎలా ఎదురుపడాలి? అసలు ఎలా ఉంటారు?

ఫోటోల్లో తప్ప విడిగా ఎప్పుడూ చూడలేదు, మరి!

ఈ ఉత్కంఠతో ఎప్పటికో గాని చిన్న కునుకు కూడా రాలేదు. వచ్చిన కునుకు అంతలోనే పోయింది. ఉదయం ఏడు గంటలకి ఎర్రబడిన కళ్లతో నిద్ర లేని మొహంతో దిగాను. అయినా ఎంతో ఉత్సాహంగా ఉంది. అలసట ఏ మాత్రమూ లేదు.

'విహాయస' కలం పేరు. ఆ పేరుతోనే వ్యవహారం. ఆమె పేరు సర్వలక్ష్మి అనుకుంటా. ఏదో పుస్తకం ముందుమాటలో చదివిన గుర్తు. రెండు పేర్లూ నాకు ఒకలాగే అనిపిస్తుంటాయి. పెద్దగా తేడా ఏం ఉంది?

ఆమె పేరు కూడా నన్ను ఎంతగా ఉత్తేజపరిచిందంటే ఇప్పుడు నేను విమానాలు నడిపే పైలట్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాను. ఉద్యోగంలో చేరబోయే ముందు నా ఇన్స్పిరేషన్ ముందు మోకరిల్లాలని ఈ ఉత్కంఠ భరితమయిన ప్రయాణం.

* * *

ఆటో ఆ వీధిలో ప్రవేశించేసరికి చెట్ల మధ్య నుంచి ఉదయపు నీరెండ నేల మీద పడి మెరుస్తోంది. రెండు వేపులా ఎరుపు తురాయిలు, ఆకుపచ్చగా. ఇది పూసే ఋతువు కానట్టుంది. అయినా గుర్తుపట్టగలిగేను. మా ట్రైనింగ్ సెంటర్ నిండా ఇవేగా. వరుసగా ఇంటి నెంబర్లు చూస్తూ... రెండూ బై ముప్ఫయ్యారు, ముప్ఫయ్యేడు, ఆ... ఇదే ముప్ఫయి ఎనిమిది. బాల్కనీ పిట్ట గోడ మీద 'చైత్రరథ' అన్న పేరు. ఆటోని ఆపి దిగాను. నవంబరు నెల. వర్షాలు వెనకబట్టి చలి అడుగు పెట్టబోతూన్న వాతావరణం. చల్లగాలి వీచింది. ఇది సముద్రపు తేమ గాలి కాదు. ఆరోగ్యకరమయిన కొండ గాలి. ఒళ్లు పులకరించింది.

గేటు తీసుకుని సూట్‌కేసు పట్టుకుని నాలుగడుగులు వేసాను. రెండు వేపులా మొక్కలు, పూలు. రక రకాల చామంతులు. 'హేమంతమేగి చామంతి పూసె ఈనాడు' ఇది హేమంత ఋతువా?

గ్రిల్ తలుపు వేసి ఉంది. కాలింగ్ బెల్ కోసం చూస్తుంటే గ్రిల్‌కి క్లిప్ చేసి పెట్టిన కాయితం. దాని వెనుక పూలగుత్తి. బెల్ కోసం ఎత్తిన చెయ్యి ఆగిపోయింది. 'గగన పథ విహారికి పూల ఎదుర్కోలు లివే' అని ఉంది ఆ కాయితం మీద.

నాకేనా? ఎంత మాత్రమూ ఊహకి అందలేదే ఇలాగ. నెమ్మదిగా కాయితం, దాని వెనకనున్న గోల్డెన్ రాడ్స్‌తో కలిపి కట్టిన చామంతి పూల గుత్తీ చేతుల్లోకి వచ్చేసాయి.

ఈ పూలగుత్తి ఇంట్లోనే కట్టిన బొకే అని తెలుస్తోంది. బయట కనిపించే బొకేల కుండే సాధారణత లేకపోవడం వల్ల. తెలుగు స్వాగతం చూస్తూ... నాకేనా... నాకోసమేనా... ఇంత గొప్ప స్వాగతం... అని ఆశ్చర్యచకితనవుతుండగా...

పచ్చటి రెండు చేతులు నా భుజాలను చుట్టాయి, నాఫ్తలిన్ బాల్స్ సువాసనను అలుముతూ.

తలెత్తి చూసి... మేడమ్... మీరు... నమస్తే... అన్నాను. తడబడుతూ. కనపడగానే నేనేం చెయ్యాలనుకున్నానో అన్నీ మర్చిపోయాను.

'ప్రయాణం బాగా జరిగిందా! రాత్రి నిద్రపట్టిందా?' అంటూ ఆమె నా చేతిలో పెట్టె అందుకోబోయారు. నేను పెట్టె ఇవ్వలేదు. ఆమెనే చూస్తూ ఉండిపోయాను.

ఆమె దారుఢ్యం. ముఖ్యంగా దేహ దారుఢ్యం. అరవై ఏళ్ల స్త్రీ లాగ ఎంత మాత్రమూ లేరు. తలలో నెరుపు అక్కడక్కడ కనిపిస్తోంది. కాని షీ ఈజ్ వెరీ హెల్దీ. పదేళ్లు తక్కువ లెక్కపెట్టినా చాలదు.

నా చేతిలో పెట్టె లాక్కుని లోపలికి తీసికెళ్లి దివాన్ పక్కన పెట్టి 'కాసేపు పడుకుంటావా? కాఫీ తాగేస్తావా?' అని అడుగుతూ ఇంకా నిలబడే ఉన్న నన్ను దివాన్ మీద కూచోబెట్టారు.

అప్పటికి నాకు మాట పెగిలింది.

'వద్దు వద్దు. ఇంక పడుకోను. ఈ రెండు రోజులూ ప్రతినిమిషం మీతో గడపాలనే కదా వచ్చింది. కాఫీ నే పెట్టనా' అన్నా.

ఈ వేళకి వద్దు. రేపు పెడుదువుగాని. ఎలా కావాలో చెప్పు చేస్తాను. అంటూ వంట గదిలోకి నన్నూ రానిచ్చారు. పాలు తక్కువ, పంచదార తక్కువతో నా కాఫీ నాకిచ్చి ఆమె నల్లటి డికాషన్ కాఫీలో పంచదార వేసుకొని తనూ తెచ్చుకుని కూచున్నారు. కాఫీల రంగులు పైకి కనిపిస్తూ గాజు కప్పులు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. తూర్పువేపు కిటికీలోంచి చల్లటి గాలి సువాసనలతో వీస్తోంది. ఉదయానికీ మిగిలిన జాజిపూల పరిమళం మెల్లమెల్లగా లోపలికొస్తోంది. చెప్పలేని ఒక నెమ్మది ఏదో మనసులోకి జారుతోంది. అయినా ఆత్రుతలు నన్ను వదలవు.

ఈమెకు భర్త, పిల్లలు ఉన్నట్టు తెలుసు. కానీ ఎవరూ కనపడడం లేదు. ఇంట్లో లేరా? నాకు ఒకటే ఆత్రం.

'నీ ఉత్తరం నిన్ననే అందింది. నిన్ననే చూసుకున్నానంటే బావుంటుందేమో! ఇ-మెయిల్‌ని కూడా ఉత్తరం అనే అనాలనిపిస్తుంది నాకు. 'వినీల' అన్న పేరు మగాళ్లు

కూడా పెట్టుకుంటారు కదూ? 'వినీల్' అని. అందుకని నువు పేరు చివర 'ఎ' అన్న ఇంగ్లీషు అక్షరాన్ని శ్రద్ధగా రాయాలి' అన్నారు.

అసలు రహస్యం అదికాదు. నాకు 'వినీలా' అని పిలిపించుకోవడం కంటె 'వినీల్' అన్న మగ పిలుపే ఇష్టం. ఫ్రెండ్స్ అంతా అలాగే పిలుస్తారు. ఆ మాటే చెప్పా.

'పేర్లకి ఆడామగా ఏముందిలే. గుర్తు కోసం. అంతే కదా!' అని నవ్వేసారు. ఆమె ఏ విషయానికీ ఎదుట మనిషితో వాదనకి దిగరు అని అర్థమయింది. కానీ ప్రతిచోటా ఇలాగే ఉంటే లోకువ కట్టెయ్యరూ!

'ఈ బ్లాక్ కాఫీ ఎలా అలవాటయింది మేడమ్ మీకు'

'అసలు చాలా రోజులు నాకు కాఫీయే అలవాటు లేదు. శంకర్ ఫ్రెండ్స్ బ్లాక్ టీ, బ్లాక్ కాఫీ అడిగి తాగుతుండేవారు. అంత చేదుగా వేడి పానీయానికి అలవాటు పడడం ఒక గొప్ప విషయంగానూ అదో గొప్ప జీవితానందంగానూ భావిస్తుండేవారు. కొన్నాళ్లకు వాళ్ల ఆ ఆలోచనను బద్దలు కొట్టాలని అనిపించింది. అప్పుడు మొదలుపెట్టాను. ఇప్పటికీ తాగడం మానలేదు నేను, వాళ్లంతా సుగర్‌లూ, బీపీలూ వచ్చి మానేసారు గానీ ఇంత చేదు పానీయం తాగడంతో రోజు మొదలు పెడితే ఇక ఆ రోజంతా ఏం జరిగినా మధురమే కదా' అంటూ కొంటెగా నవ్వేరు.

వయసు కొంటెతనాన్ని చంపలేదు సరికదా ఏ మాత్రమూ తగ్గించినట్లు కూడా లేదు.

ఇంతకీ శంకర్ ఇంట్లోనే ఉన్నాడా... ఉన్నారా... ఇంకా లేవలేదా? ఆగ లేకపోయాను. 'సార్ ఉన్నారా మేడమ్? ఎటయినా వెళ్ళారా?'

ఉన్నారోయ్! లేవరు. తొమ్మిది దాకా లేవరు. నేను ఉదయపు పక్షిని. లేచి ఓ గంట నడుస్తాను. నల్ల కాఫీతో అలర్ట్ అవుతాను. ఆపైన పూల మొక్కలు, పాదులు నాకోసం ఎదురుచూస్తుంటాయి. పద చూద్దాం అంటూ దారి తీసారు.

వంద గజాల పెరడులో చిన్న తోట. పూలు, కూరలు, ఆకుకూరలు, వాటికి పాదులు, నీళ్లు, పరిచర్య అయ్యేసరికి గంటపట్టింది. ఆ గంటా ఆమె పూల రకాల గురించి, సహజ ఎరువుల గురించి, ఆకుకూరల పెంపకంతో ఉండే ఇబ్బందుల గురించి మాట్లాడుతూ ఉన్నారు. నాకు బోర్‌గా అనిపించింది. ఇందుకోసం కాదుగా ఇంత దూరం వచ్చింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=246**